
మహిళా దినోత్సవం
సాక్షి అనకాపల్లి
రేపటికి ముందడుగు
7
బుధవారం ׀ 8 ׀ మార్చి ׀ 2023





న్యూస్‌రీల్

వ్యాయామంతో వ్యాధులు దూరం



సైకిల్ ర్యాలీలో డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లిటౌన్: క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డీఎంహెచ్‌వో హేమంత్ అన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఆయన మంగళవారం సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అంతకు ముందు వైద్య సిబ్బంది, స్కూల్ విద్యార్థులు ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో.. బేటీ పడావో అంటూ ర్యాలీలో నినదించారు. ఈ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యులు కిశోర్‌కుమార్, ఝాన్సీరాణి, మురళి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : పట్టణంలోని చందకవీధికి చెందిన శ్రీ లక్ష్మీదుర్గ నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు 50 కుటుంబాలు మంగళవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మలువల గోవింద, జంపా సూరిబాబు, తామవరపు ప్రసాద్, మలివలస సన్యాసినాయుడు, శ్రీను, కోనేటి వాసు, అప్పారావు, మోహన్, జంపా అమ్మాజీ, భవ్యవరపు రాంబాబు, అప్పలరాజు, శ్రీను, సత్తిబాబు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఆయన ఆహ్వానించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినవారికి సముచిత స్థానం ఉంటుందని ధర్మశ్రీ అన్నారు.

ఎంత పని చేశావయ్యా..



గాయాలతో మృతి చెందిన బాలుడు

ఎస్.రాయవరం: ఇంట్లో చెప్పకుండా వచ్చాడో.. ఎందుకు ఒంటరిగా ప్రయాణిస్తున్నాడో తెలీదు గానీ అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఒక బాలుడు (15) తీవ్ర గాయాలతో కనిపించాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. జాతీయ రహదారి పక్కన అడ్డురోడ్డు నుంచి గెడ్డపాలెం రోడ్డు జంక్షన్ మధ్యలో ఈ ప్రమాదం జరిగిందని ఎస్.రాయవరం హెడ్ కానిస్టేబుల్ భూలోకరావు తెలిపారు. బాలుడి తలకు తీవ్ర గాయం కావడం వల్ల మృతి చెందాడన్నారు. ఈ బాలుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని లేదా ప్రయాణిస్తున్న వాహనం నుంచి జారి పడిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని చెప్పారు. బాలుడి పేరు సాయికుమార్ అని, యలమంచిలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన వాడని తెలుస్తోంది. తల్లిదండ్రులు లేరని, అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడని, ఇంటి నుంచి తరచు వెళ్లిపోతుంటాడని సమాచారం. పూర్తి వివరాలు కుటుంబ సభ్యులు వచ్చాక తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

ఆకాశమే హద్దుగా..

ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందన్నారు మహాకవి గురజాడ. ఆయన మాటను నిజం చేస్తూ.. ఆకాశమే హద్దుగా సత్తా చాటుతామంటున్నారు నేటి మహిళలు. ఆలన–పాలన నుంచి ఆర్మీ, అంతరిక్షం వరకు ఎందాకైనా వెళ్లే సాహసం వారి సొంతం. ఏదైనా సాధించగల ఆత్మ విశ్వాసం వారి ఆయుధం.



సాక్షి, అనకాపల్లి: అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులకు ఎందులోనూ తీసిపోమని నిరూపించుకుంటున్నారు. అమ్మలా లాలించడమే కాదు... సమర్థవంతంగా పాలించడంలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా సమర్థంగా పనిచేస్తున్నారు. విశాఖ మేయర్ హరివెంకటకుమారి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర వంటి ప్రజాప్రతినిధులు పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఇక జేసీ కల్పనాకుమారి, ఎస్పీ గౌతమి సాలి, విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ అధికారులుగా రాణిస్తున్నారు. ఈ స్థాయికి రావడం వెనుక వారి కృషి, ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానం వారి మాటల్లోనే..

మహిళలు పరస్పరం సహకరించుకోవాలి..



నాకు అమ్మానాన్నల ప్రోత్సాహం ఎంత వరకు ఉందో... ఐపీఎస్ సాధించడం వెనుక స్నేహితుల సహకారం కూడా అంతే ఉంది. ఎల్‌కేజీ నుంచి బీటెక్ వరకూ తిరుపతిలోనే చదువుకున్నాను. కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొన్నాళ్లపాటు ఉద్యోగం చేశాను. ఇంతవరకు నా పేరెంట్స్ ప్రోత్సాహం అందించగా.. ఇక్కడ నుంచి నా స్నేహితులే నన్ను ముందుకు నడిపించారు. ప్రస్తుతం విజయనగరం ఎస్పీగా పనిచేస్తున్న దీపిక కుమారి, చిత్తూరు ఎస్పీగా పనిచేస్తున్న అపూర్వ ఇద్దరూ నాకు స్నేహితులు. వారిద్దరి నుంచి చాలా నేర్చుకున్నాను. ఎంతో ప్రతిష్టాత్మకమైన పోలీస్ ఉద్యోగంలో చేరిన తర్వాత నా సీనియర్లు, జూనియర్ల నుంచి కూడా వృత్తిపరమైన ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఒక మహిళకు మరో మహిళ సపోర్టుగా నిలవాలి. తల్లిదండ్రులు అమ్మాయిలను, అబ్బాయిలను సమానంగా చూడగలగాలి. విద్యా, ఉద్యోగాల్లో అబ్బాయిలతో పాటు అమ్మాయిలు కూడా సమానంగా రాణిస్తున్నారు. పోలీస్ అధికారిగా ప్రజలకు రక్షణగా నిలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. – గౌతమి సాలి, ఎస్పీ

సేవతోనే సంతృప్తి..



సేవ చేయాలన్న తపనే రాజకీయాలవైపు నడిపించింది. దంతవైద్యాధికారి ఉద్యోగం వదలి ఇటువైపు వచ్చా. అరకు నియోజకవర్గంలోని అనంతగిరి మండలం భీమవరం గ్రామం మాది. అమ్మ శోభా హైమావతి ఎమ్మెల్యేగా పనిచేశారు. సేవ చేయాలన్న తపనతో సాలూరు నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది, విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టాను. ఏపీ బెస్ట్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. మహిళలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యతకు ఆకర్షితురాలినై వైఎస్సార్‌సీపీలో చేరాను. జీసీసీ చైర్‌పర్సన్ బాధ్యత చేపట్టి, జీసీసీ బలోపేతానికి కృషి చేస్తున్నాను. మహిళలు కష్టాల్లో కుంగిపోకుండా ఎదుర్కొంటే అనుకున్న దానిని సాధించవచ్చు. – శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

చదువే ముందుకు నడిపించింది..



ముంచంగిపుట్టు మండలం లబ్బూరు వంటి గిరిజన గ్రామంలో పుట్టిన నేను ఈరోజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్నానంటే.. నా చదువు సంధ్యలే అందుకు కారణం. పెళ్లయినా నేను చదువు ఆపలేదు. భర్త సహకారంతో డిగ్రీ పూర్తి చేశాను. ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా రోజుకు సుమారు 240 కిలోమీటర్లు ప్రయాణిస్తూ బీఈడీ చదువుకోవడానికి చోడవరం వచ్చేదాన్ని. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. పాడేరులోని సెయింటాన్స్ పాఠశాలలో టీచర్ పనిచేస్తుండగా అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకి ప్రవేశించాల్సివచ్చింది. ముంచంగిపుట్టు జెడ్పీటీసీగా గెలవడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశమిచ్చారు. చదువే నన్ను ఇంతటిదాన్ని చేసిందని నమ్ముతున్నాను. విద్యావంతురాలైన మహిళ నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదు. తలచుకోవాలే గానీ అతివకు సాధ్యం కానిదేమీ ఉండదు కదా.

– జె.సుభద్ర, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్

పురుషులతో సమాన ప్రాధాన్యం



నర్సీపట్నం పంచాయతీ సర్పంచ్‌గా 2004లో రాజకీయ అరంగేట్రం చేశాను. ప్రజలకు సమర్థంగా సేవలందించడంలో నా భర్త చింతకాయల సన్యాసిపాత్రుడు ప్రోత్సాహం మరువలేనిది. 2014 నుంచి 2019 వరకు నర్సీపట్నం మున్సిపాలిటీ తొలి చైర్‌పర్సన్‌గా పనిచేశాను. ఇప్పుడు ఉమ్మడి విశాఖ డీసీసీబీ చైర్‌పర్సన్‌గా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంతో సహకార రంగంలో సేవలందిస్తున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు అందిస్తోంది. ఈ అవకాశాన్ని అందరూ అందిపుచ్చుకోవాలి.

– చింతకాయల అనిత, ఉమ్మడి విశాఖ జిల్లా డీసీసీబీ చైర్‌పర్సన్



మహిళలతో కేక్ కట్ చేయిస్తున్న జేసీ కల్పనాకుమారి

మహిళల పాత్ర కీలకం

అనకాపల్లి టౌన్: సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాలులో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారన్నారు. చిన్నచూపునకు గురైన మహిళలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మహిళలతో జేసీ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఆర్‌బీఐ ఏజీఎం పూర్ణిమ, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టీచర్ ప్రోత్సాహంతోనే...



నా స్వస్థలం ప్రకాశం జిల్లా మార్కాపురం. నా తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. నేను టీచర్ వృత్తికి రావడానికి సైన్స్ టీచర్ ప్రమీలారాణి ప్రోత్సాహమే కారణం. అడుగడుగునా నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మహిళలు ఉద్యోగాలు చేయడం గతంలో ఇష్టముండేది కాదు. కాని వనితే దేశాభివృద్ధికి వెన్నెముకగా మారింది. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖల్లో మహిళా ఉద్యోగులు ఉన్నారు. భవిష్యత్తు వారిదే.

– వెంకటలక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

అమ్మాయిలు ఆర్థికంగా ఎదగాలి..



మా కుటుంబం తొలి నుంచి రాజకీయాల్లో ఉన్నా.. నేను మాత్రం నా భర్త ప్రోద్బలంతోనే కార్పొరేటర్‌గా పోటీ చేశాను. గెలిచిన మరుక్షణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేయర్‌గా అవకాశం కల్పించారు. అతివలు బాధ్యతలను సమర్థంగా నెరవేర్చగలరు. ప్రతి అమ్మాయి చక్కగా చదువుకొని ఆర్థికంగా ఎదగాలి. –జి.హరివెంకటకుమారి, విశాఖ మేయర్

మహిళలంటే చులకనభావం పోవాలి



మహిళలందరినీ విద్యావంతులను చేయాలి. బాల్య వివాహాలు మాని వారికి ఎదిగే అవకాశమివ్వాలి. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు. మహిళలు చదువుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వస్తేనే బాలికలు పురోగమించగలరు.

– జి.స్వరూపరాణి, విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ

నేత్రపర్వంగా వెంకన్న చక్రతీర్థం

- ఘనంగా మహాపూర్ణాహుతి
- సముద్రస్నానాలకు తరలివచ్చిన భక్తజనం



స్వామి వారికి నూతన మధుపర్కాలతో అలంకరణ



చక్ర పెరుమాళ్లను సముద్రంలో స్నానమాచరింపజేస్తున్న దృశ్యం

నక్కపల్లి : కల్యాణోత్సవాల్లో భాగంగా ఉపమాక వెంకన్న చక్ర స్నానం మంగళవారం ఘనంగా జరిగింది. పౌర్ణమినాడు వేంకటేశ్వరుడు అత్తారింటికి వెళ్లే సన్నివేశాన్ని చక్ర స్నానంగా పిలుస్తారు. కల్యాణం అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. తిరుమంజన, నాలాయిర సేవలు, మహాపూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామిని రాజాధిరాజవాహనంపై రాజయ్యపేట సముద్రతీరానికి తీసుకెళ్లారు. పందిట్లో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి, చక్రపెరుమాళ్లను సముద్రంలోకి తీసుకెళ్లి, సముద్ర జలాలను తెచ్చి స్వామివారిని అభిషేకించారు. అనంతరం స్వామివారిని ఆలయానికి తీసుకొచ్చి అద్దాల మండపంలో డోలోత్సవం నిర్వహించారు. సాయంకాల తిరువారాధన, స్నపన తిరుమంజనం అనంతరం నాలాయిర సేవాకాలంలో ఆరాధన, ప్రసాద నివేదన చేశారు. ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వచ్చిన మహిళలు, చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

పులకించిన రాజయ్యపేట తీరం

వెంకన్న కల్యాణోత్సవాల్లో పౌర్ణమినాడు స్వామివారిని చక్ర స్నానానికి తీసుకెళ్తారు. ఆ సమయంలో సాగరంలో స్నానమాచరిస్తే సకల పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. ఉపమాకలో పౌర్ణమి జాతర సందర్భంగా నక్కపల్లి నుంచి రాజయ్యపేటవరకు ఉన్న రహదారి భక్తుల రాకపోకలతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల నుంచి పలువురు తోడపెద్దులు, అమ్మవారి ఘటాలు తెచ్చి సముద్ర స్నానమాచరింపజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు, రంగనాథస్వామి, శ్రీనివాస భక్త సమాజం సభ్యులు తాడేల రవి పాల్గొన్నారు.

వేంకటేశుడి నాగవల్లి వసంతోత్సవం

- కోనేటి రాయుడికి శారదా నదిలో చక్రస్నానం
- రాష్ట్రం నలుమూల నుంచి భారీగా భక్తుల రాక



వడ్డాదిలో భారీగా తరలివచ్చిన భక్తులు



వడ్డాది శారదా నదిలో వేంకటేశునికి చక్రస్నానం

బుచ్చెయ్యపేట : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. వేంకటేశుని 150వ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన మంగళవారం నాగవల్లి వసంతోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేంకటేశుడు కొలువైన గిరిజాంబ కొండకు వెళ్లే దారులన్నీ భక్తుల గోవింద శరణు ఘోషతో హోరెత్తాయి. వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ విగ్రహాలను కొండపై నుంచి కిందికి దించారు. ప్రత్యేక రథంపై ఉంచి, మేళతాళాల నడుమ వడ్డాది పుర వీధుల్లో తిరువీధోత్సవం వేడుకగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు వసంతోత్సవంలో పాల్గొని పులకించారు. పలువురు భక్తులు స్వామి వారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. రథం భక్తి గీతాలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ భక్తులు స్వామిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. సాయంత్రం వడ్డాది శారదా నదిలో ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు అన్నయ్య కుమారుడు శ్రీరామ్ శిరస్సుపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేదపండితులు శాస్త్రోక్తంగా చక్ర స్నానం చేయించారు. అదే సమయంలో భక్తులు శారదా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను గిరిజాంబ కొండపైకి చేర్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ ప్రత్యేకాధికారి ఆదినారాయణ, ఈవో శర్మలు పాల్గొన్నారు.

నాగవల్లి వసంతోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ కుమారస్వామిలు 150 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ముందు జాగ్రత్తగా బీఎన్ రోడ్డులో బంగారుమెట్ట మీదుగా వాహనాలను మళ్లించడంతో భారీగా భక్తులు ఉత్సవానికి తరలివచ్చినా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడలేదు.

విశాఖ సమ్మిట్ దేశానికే ఆదర్శం

- ప్రతిపక్షాలు సైతం మెచ్చుకుంటున్న వైనం
- లక్షలాది ఉద్యోగాలతో యువతకు మేలు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పారిశ్రామిక దిగ్గజాలు తరలిరావడంతో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. మంగళవారం మాడుగులలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ సమ్మిట్ వల్ల విశాఖ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగిందన్నారు. సమ్మిట్‌లో 378 అవగాహన ఒప్పందాలు చేసుకోవడంతో 20 రంగాల్లో దాదాపు రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయన్నారు. 6.09 లక్షలమందికి ఉద్యోగావకాశాలు కలగనుండడంతో సీఎం జగన్ దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయన ఆలోచన విధానం వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా పరుగులు తీయబోతుందని, ప్రగతి పరవళ్లు తొక్కుతుందని, ఇప్పటి యువతరానికి, రాబోయే తరానికి కూడా మేలు జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు కూడా హర్షం వెలిబుచ్చడం విశేషమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రాంతంలో పరిశ్రమలొచ్చినా అక్కడ స్థానిక యువతకే 75 శాతం ఉద్యోగాలు కేటాయించడం మరొక అద్భుతమైన ఆలోచనా విధానమన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీసా, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, సహకార సంఘం అధ్యక్షుడు పెరుమళ్ళ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో రాజధానికి స్వాగతం పలుకుదాం



శిష్టకరణాల సంఘీభావ సభలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎంపీ ఆర్.కృష్ణయ్య

- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి
- సీతంరాజుకు మద్దతు తెలిపిన కళింగ వైశ్య, శిష్టకరణాలు, క్షత్రియ, రెడ్డి సంక్షేమ సంఘాలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపుతో పరిపాలన రాజధానికి స్వాగతం పలుకుదామని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర కళింగ వైశ్యుల, శిష్టకరణాల, క్షత్రియ, రెడ్డి సంక్షేమ సంఘాలు మంగళవారం ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతు తెలిపాయి. పీఎంపాలెంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో ఉత్తరాంధ్ర కళింగ వైశ్యుల సమావేశం జరిగింది. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు, శిష్ట కరణాల సంఘం నాయకుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వై.వి సుబ్బారెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, బీసీ కమిషన్ సభ్యుడు పక్కిదివాకర్, శిష్టకరణాల జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు డీవీ కృష్ణారావు పాల్గొన్నారు. శ్రీ వేమన సంక్షేమ సంఘం, గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కలయికలో ఎంపీ కృష్ణయ్య, ఎమ్మెల్యే నాగిరెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వీరరాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సీతమ్మధారలోని కె.ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో క్షత్రియ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వై.వి సుబ్బారెడ్డి, ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సధాకర్, కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, ఉత్తరాంధ్ర కళింగ వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

డీఎస్‌వో ప్రసాద్ సస్పెన్షన్

అనకాపల్లి టౌన్: జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌వో) కె.వి.ఎస్.ఎం.ప్రసాద్‌ను ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ మంగళవారం సస్పెండ్ చేశారు. విధినిర్వహణలో అలసత్వంతో వ్యవహరిస్తూ జిల్లాస్థాయి ఉన్నత సమావేశాల్లో తప్పుడు నివేదికలు సమర్పించడంతో ఆయనను జాయింట్ కలెక్టర్ ఐదు రోజుల క్రితం సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఆయనపై ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ కమిషనర్ తాజాగా ఉత్తర్వులిచ్చారు. అతని స్థానంలో ఏఎస్‌వో సి.ఎస్.ఆర్.లక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

126 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట : పాల్మన్‌పేట గ్రామంలో పాన్‌షాప్‌లో మద్యం అమ్మకాలను గమనించి దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్మకం చేస్తుండగా 126 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ సీఐ పి.టి.వి.కుమార్ తెలిపారు. మద్యం అమ్మకానికి సంబంధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు.

ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులు కీలకం

బ్యాంకర్లతో సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్ : ఏ ప్రాంతమైనా ఆర్థికంగా పరిపుష్టి సాధించాలంటే బ్యాంకులే కీలకమని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన బ్యాంకర్లతో సమావేశమయ్యారు. అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకులు సాధించిన లక్ష్యాలపై సమీక్షించారు. వ్యవసాయం, కౌలు రైతులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మొదలైన వాటికి తగిన రుణాలు అందించి జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పడాలని సూచించారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లా వేగవంతంగా అభివృద్ధిలో ఉండాలంటే ప్రభుత్వ బ్యాంకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

ఇకపై సమావేశాలకు పూర్తి సమాచారంతో బాధ్యతగా అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులకు, మహిళా సంఘాలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి నిపుణులతో అధ్యయనం చేయించాలన్నారు. జగనన్న తోడు, టిడ్కో, పీఎంఇజీపీ రుణాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వు బ్యాంకు జిల్లా ప్రతినిధులు పూర్ణిమ, నాబార్డు జిల్లా అధికారి శ్రీనివాసులు, లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణమూర్తి, యూబీఐడీఆర్ హెచ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించాలి

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని పట్టభద్రులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. గాంధీగ్రామం, దామునాపల్లి, మైచర్లపాలెం, ఖండిపల్లి గ్రామాల్లో ధర్మశ్రీ విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయం, ఇతర శాఖలో వేలాది ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఉన్నత విద్యకు, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు గాడి అప్పారావు, బూరే మాణిక్యం, శానాపతి రాజశేఖర్, బలిరెడ్డి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు శానాపతి సత్యారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బయ్యవరంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కశింకోట: మండలంలోని బయ్యవరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఒక టీ దుకాణం వద్ద ఆ వ్యక్తి మృతి చెంది ఉండడంతో వీఆర్‌వో ధర్మిశెట్టి ఉదయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. వ్యక్తి ఆచూకీ కోసం బంధువులు తమను సంప్రదించాలని కోరారు.

వేధింపులతోనే పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

కేడీపేటకు చెందిన పీఈటీ విజయ్‌కుమార్ అరెస్ట్



పీఎంపాలెం: పాలిటెక్నిక్ విద్యార్థినిని వేధించి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వ్యక్తిని పీఎంపాలెం పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. పీఎంపాలెంలోని సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని(17) గత నెల 20న ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కేడీపేటలోని ఎంఎల్‌పురంలో విద్యార్థిని తండ్రి కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. నర్సీపట్నం మార్కెటింగ్ కమిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. పెద్ద కుమార్తె(17)ను సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదివిస్తున్నాడు. ఆమె పీఎంపాలెంలోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 20న క్లాస్‌కు వెళ్లడం లేదని ఇంటికి వస్తున్నానని తండ్రికి ఫోన్ చేసింది. ఆ తర్వాత ఫోన్ చేయలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. అదే రోజు సాయంత్రం హాస్టల్ నిర్వాహకుడు గణేష్ ఆమె తండ్రికి ఫోన్ చేసి.. మీ కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలియజేశాడు. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ వై.రామకృష్ణ దర్యాప్తు ప్రారంభించారు.

గుట్టు విప్పిన ఫోన్ కాల్స్

పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యార్థిని ఫోన్‌లో కాల్స్ పరిశీలించారు. ఒకే నంబర్‌తో వందల సంఖ్యలో ఎస్ఎంఎస్‌లు, కాల్స్ ఆమె ఫోన్‌కు వచ్చినట్లు గుర్తించారు. ఆ ఫోన్ కాల్స్ చేసింది మాజీ పీఈటీ ఇత్తుల విజయ్ కుమార్(33) అని తెలుసుకున్నారు. అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేడీ పేటకు చెందిన విజయ్‌కుమార్ గతంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేశాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక ను లైంగికంగా వేధించాడు. ఈ క్రమంలో విద్యార్థిని పై చదువుల కోసం పాలిటెక్నిక్ కళాశాలలో చేరింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఆమె పీఎంపాలెం వచ్చేయడంతో అతను పీఈటీ ఉద్యోగం మానేశాడు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పి ఆరిలోవలోని లక్ష్మీపురంలో ఇల్లు అద్దెకు తీసు కుని విద్యార్థిని కదలికలు తెలుసుకునేవాడు. ఆమె ను వెంబడించి వేధించేవాడు. వేధింపులకు తాళ లేక ఆ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది.

ముగ్గురు పిల్లలున్నా..

నిందితుడు విజయ్‌కుమార్‌కు 9 సంవత్సరాల కిందట వివాహం అయింది. ముగ్గురు పిల్లల తండ్రి. అయినా వక్రబుద్ధితో బాలికను లైంగికంగా వేధించాడు. ఆమె తోటి స్నేహితురాళ్ల ముందు కూడా వేధింపులకు పాల్పడేవాడు. చెప్పుకోలేని బాధ, అతని పీడ పోవాలంటే ఆత్మహత్యే శరణ్యమని భావించి తనువు చాలించిందని పోలీసులు భావిస్తున్నారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ టీచర్‌కు గాయాలు

చోడవరం రూరల్ : స్థానిక కోఆపరేటివ్ కాలనీలో నివసిస్తున్న రిటైర్డ్ టీచర్, 75 ఏళ్ళ మండల శ్రీరామ్మూర్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన గాయపడినట్టు చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం శ్రీరామ్మూర్తి చీడికాడ మండలం జి.కొత్తపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో వలంటీర్ టీచర్‌గా చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తన స్కూటీపై కొత్తపల్లి బయలుదేరి దామునాపల్లి గ్రామం దాటేసరికి గుర్తు తెలియని వాహనం ఆయన స్కూటీని ఢీకొట్టడంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఆయనను అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తప్పిన ప్రమాదం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి- చోడవరం రహదారిలో స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి కింద మంగళవారం పెద్ద ప్రమాదం తప్పింది. చోడవరం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ రైల్వే హైట్ బ్యారియర్‌ను ఢీకొంది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోకవడంతో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.



రైల్వే అండర్ బ్రిడ్జి కింద కూలిన హైట్ బ్యారియర్

ఉరి వేసుకుని వివాహిత మృతి

చోడవరం రూరల్ : పట్టణ పరిధిలోని గునిశెట్టివారి వీధికి చెందిన వివాహిత తెలపల్లి రోహిణి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం రోహిణి సోమవారం తన నివాసంలో ఉరి వేసుకుని మృతి చెందిందన్నారు. ఈ మృతిపట్ల ఆమె సోదరుడు సతీష్ అనుమానాన్ని వ్యక్తం చేస్తూ తమకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలతోపాటు తన చెల్లికి ఆమె భర్త రమణకు మధ్య తరచూ మనస్పర్థలు ఉండేవని, ఆమె మృతి పట్ల అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఆస్పత్రుల్లో డైట్ టెండర్లకు ఆహ్వానం

మహారాణిపేట : ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు ఇచ్చే డైట్ సరఫరాకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు. డైట్ ధరలు పెంచడం వల్ల ప్రస్తుతం అమలు చేస్తున్న టెండర్లు రద్దు చేశారు. యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (50 పడకలు) ఆస్పత్రిలో రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా కోసం రెండేళ్ల కాల పరిమితికి సీల్డ్ టెండర్లు ప్రస్తుతం ఆహ్వానిస్తున్నారు. పెందుర్తి జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి కార్యాలయంలో టెండరు ఫారాలను పొందవచ్చు. 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలి.

పంచదార్లలో కల్యాణోత్సవాలు



స్వామిని దర్శించుకుంటున్న సుకుమారవర్మ

రాంబిల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పంచదార్లలో శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ) తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

సర్పంచ్‌పై దాడి కేసులో ముగ్గురు అరెస్టు

దేవరాపల్లి : వెంకటరాజుపురంలో ఇటీవల స్థానిక సర్పంచ్‌పై దాడి చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవల దర్యాప్తు జరిపి నిందితులైన వనము వెంకటేష్, వనము దాలిబాబు, పెనగంటి వెంకటరావులను చోడవరం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచామన్నారు. ఈ కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ముగ్గురికి వ్యక్తిగత పూచీకత్తులపై బెయిల్ మంజూరు చేశారన్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

మోతుగూడెం : మోటార్ బైక్‌పై గంజాయి తరలిస్తున్న నిందితులను మోతుగూడెం పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. మోతుగూడెం ఎస్‌ఐ వి.సత్తిబాబు సిబ్బందితో లక్కవరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. మోటార్ బైక్‌పై రెండు ప్లాస్టిక్ బ్యాగుల్లో తరలిస్తున్న 25 కేజీల గంజాయిని వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజాయిని ఒడిశా రాష్ట్రం కెందువాడ గ్రామంలో కొనుగోలు చేసి భోపాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన హారోం ఉపాధ్యాయ, కమలేష్‌లు, వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీకి చెందిన పాంగి కిషోర్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక మోటార్ బైక్, ఐదు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీలో ఏఎస్‌ఐ పట్టాభిరామయ్య, హెచ్‌సీ సత్తిబాబు, పీసీలు సన్యాసిరావు, మురళీకృష్ణ, శివప్రసాద్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు

కశింకోట : స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సురేష్‌నాయుడు మంగళవారం తెలిపారు. ఈ కేంద్రాల పరిధిలో 1458 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో 189 పోలింగ్ కేంద్రంలో 788 మంది, 190 పోలింగ్ కేంద్రంలో 670 మంది ఉన్నట్టు వెల్లడించారు. ఈ నెల 13న వీరంతా కశింకోటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

గాయపడిన విద్యార్థులకు ఎంపీపీ పరామర్శ



ఎన్టీఆర్ వైద్యాలయంలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : మార్టూరు వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు వైద్యుల్ని కోరారు. ప్రమాదంలో గాయపడి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంగళవారం ఆయన ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు అందుతున్న వైద్యంపై డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ధైర్యం చెప్పారు. తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారి అనిల్‌కుమార్

అనకాపల్లిటౌన్ : గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఈ నెలాఖరు వరకు వేయనున్నట్లు గవరపాలెం పశువైద్యాధికారి అనిల్‌కుమార్ చెప్పారు. మండలంలో సత్యనారాయణపురంలో మంగళవారం 150 పశువులకు గాలిగుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నెలాఖరు నాటికి 1800 పశువులకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. అంతకుముందు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కావ్య, రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
కోనసీమ	సత్యనారాయణ-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్‌స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 6,275 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	3,940
మొదటి రకం	3,430	3,670
రెండో రకం	3,150	3,560
మూడో రకం	3,050	3,140

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 254 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సాగునీటి చెరువులు.. 'అమృత్' ఫలాలు

అమృత్ సరోవర్‌తో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, జలాశయాల రూపురేఖలు మారుతున్నాయి. పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన చెరువులకు 'ఉపాధి' పనులతో కొత్త కళ తీసుకొస్తున్నారు. కశింకోట మండలంలో ఇప్పటికి మూడు చెరువుల్ని అమృత్ సరోవర్‌లో అభివృద్ధి చేశారు. దీంతో సుమారు 230 ఎకరాల ఆయకట్టుకు రానున్న ఖరీఫ్ సీజన్లో సాగునీటికి ఢోకా ఉండదని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కన్నూరుపాలెంలో అభివృద్ధి చేసిన తుమ్మ చెరువు

- రూ.అరకోటితో మూడు చెరువుల అభివృద్ధి
- 230 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ధీమా

కశింకోట : మండలంలో అమృత్ సరోవర్ కార్యక్రమం కింద జాతీయ ఉపాధి హామీ పథకంలో మూడు సాగునీటి చెరువులను అభివృద్ధి చేశారు. ఇందుకు రూ.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించారు. సుమారు 230 ఎకరాల భూములకు పుష్కలంగా సాగునీటి సదుపాయం కలగనుంది. దీంతో అయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో..

అమృత్ సరోవర్ కార్యక్రమంలో చెరువులను ఉపాధి పథకం నిధులతో ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని మూడు సాగునీటి చెరువులను అధికారులు ఎంపిక చేశారు. ఉపాధి నిధులతో వీటి అభివృద్ధి పనులను గతేడాది ప్రారంభించారు. తాజాగా వీటి పనులు కూడా పూర్తయ్యాయి. వీటికి రూ.51.21 లక్షలు వెచ్చించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల చొరవ, ఉపాధి సిబ్బంది పర్యవేక్షణ పనుల ప్రగతికి దోహదపడింది. గత సీజన్లో వర్షాలు విపరీతంగా కురవడంతో చాలాసార్లు పనులకు ఆటంకం ఏర్పడింది. అయినప్పటికీ వెసులుబాటు కలిగిన ప్రతిసారీ ఈ చెరువు పనుల్ని జరిపి, వీలైనంత వేగంగా పూర్తిచేశారు. తీడలోని మాలపాటి చెరువును ఇటీవల కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సందర్శించి, పూర్తయిన పనుల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మూడు చెరువులు.. రూ.అరకోటి వ్యయం

- తీడ గ్రామంలోని మాలపాటి చెరువును రూ.14.50 లక్షలతో అభివృద్ధి చేశారు. ఈ చెరువు సామర్థ్యం పెరిగేలా మరింత లోతు చేసి, తొలగించిన పూడికతో గట్లను పటిష్టం చేశారు. గట్లపై కొబ్బరి మొక్కలను నాటి పెంపకం చేపట్టారు. తాజాగా పనులు పూర్తి అయ్యాయి. దీని కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది.
- కన్నూరుపాలెంలో తుమ్మ చెరువును లోతు చేసి గట్లను పటిష్టం చేశారు. దీనికి రూ.18.16 లక్షలు ఖర్చు చేశారు. ఈ చెరువు కింద సుమారు 50 ఎకరాల ఆయకట్టు ఉంది.
- సుందరయ్యపేటలో అచ్చెన్న చెరువును రూ.18.55 లక్షలతో అభివృద్ధి చేశారు. దీనికింద సుమారు 30 ఎకరాల ఆయకట్టు ఉంది.

రోజూ 300 మందికి ఉపాధి

దాదాపు పనులు జరిగినన్నాళ్లూ ఒక్కో చెరువులో 300 మంది వరకు ఉపాధి కూలీలు పని చేశారు. వ్యవసాయ పనుల్లేని సమయంలో వారికి ఉపాధి లభించడంతో పాటు చెరువులు కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకున్నాయి. దీంతో రానున్న వర్షా కాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందగలదని అధికారులు పేర్కొంటున్నారు. దశాబ్దాల క్రితం మాదిరి తమ ఊరి చెరువుల రూపురేఖలు మారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తీడలోని మాలపాటి చెరువులో పనులు(ఫైల్)

ఆయకట్టుకు సాగునీటి ధీమా

అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి పథకం నిధులతో తీడ, కన్నూరుపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో ఒక్కో చెరువు చొప్పున అభివృద్ధి చేశాం. ఈ చెరువుల కింద 230 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో రానున్న వర్షా కాలంలో చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందగలదు. చెరువుల అభివృద్ధి పనులతో ఆయా గ్రామాల ప్రజలకు వందల సంఖ్యలో పని దినాలు కల్పించాం.
– శివ, ఏపీవో, కశింకోట.

సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



తుమ్మపాలలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ప్రచారం

- మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుల అభ్యర్థన

అనకాపల్లి రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపును కాంక్షిస్తూ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయా ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులను కలిసి అభ్యర్థించారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శ్రీరామరక్షని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, కొండుపాలెం, సచివాలయాల పరిధిలో గల పలువురు ఓటర్లు, ఉపాధ్యాయులను కలిసి ఓటుకోసం అభ్యర్థించారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రచారంలో ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, సర్పంచ్ తలారి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బుజ్జి, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గనిరెడ్డి శ్రీరామ్, సచివాలయ కన్వీనర్ కసిరెడ్డి ప్రసాద్, పెద్దాడ రామ్‌శంకర్ పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యం

వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో పెట్రోల్ బంక్ నుంచి మెయిన్ రోడ్డు, ప్రమీలానగర్ పరిసర ప్రాంతాల్లో ఓటర్లున్న ఇళ్లకు వెళ్లి, తమ పార్టీ బలపర్చిన సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈయన వెంట సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది పిళ్లా హరశ్రీనివాసరావు, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, ఆర్టీసీ సత్యనారాయణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ మొగసాల లక్ష్మి, మొగసాల వెంకట్, పంచాయతీ వార్డు సభ్యులు యనమశెట్టి రామారావు, వెలగా మోదినాయుడు, లక్ష్మీ భాస్కర్, శ్రీలక్ష్మి, రాము పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్ : సీతంరాజు సుధాకర్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక జీవీఎంసీ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల, హైస్కూళ్లలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ పాలనకు పాలనకు మద్దతుగా పట్టభద్రులంతా సుధాకర్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, బొండా శంకరరావు, లట్టాల మురళీకృష్ణ, వేల్పుల గణేష్, జెట్టి శ్రీనివాసరావు, బొద్దపు గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఫణికుమార్

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా 10వ అదనపు న్యాయమూర్తి ఫణికుమార్ అన్నారు. గవరపాలెం మహిళా కళాశాల ఆవరణలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉన్నపుడే నేరాలను నియంత్రించవచ్చన్నారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి, కోర్టును ఆశ్రయించాలని సూచించారు. ప్రభుత్వాలు మహిళల రక్షణకు అనేక చట్టాలను తీసుకొచ్చాయన్నారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ రకాలైన చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు గంగరాజు, డాక్టర్ అమరరంగేశ్వరరావు, విజయచందర్, నిరుపమ, ప్రదీపా, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై అవగాహన



ఎస్‌హెచ్‌జీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట : స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల అధ్యక్షులకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణలో రెండో రోజు మంగళవారం విజన్ బిల్డింగ్(కలల నిర్మాణం)పై అవగాహన కలిగించారు. పేదరికం తగ్గింపు, ఆరోగ్యం, పౌష్టికాహారం, పారిశుధ్యం, విద్య, స్త్రీ పురుష సమానత్వం, ప్రకృతి వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, రక్త హీనత నివారణకు తీసుకోవలసిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, ఏపీఎంలు తిలక్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'అదానీ సంస్థపై పార్లమెంటరీ కమిటీ వేయాలి'



కశింకోట ఎస్‌బీఐ బ్రాంచి వద్ద కాంగ్రెస్ నాయకుల ఆందోళన

కశింకోట : అదానీ సంస్థలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త ఆందోళనల్లో భాగంగా నియోజకవర్గ నాయకులు స్థానిక ఎస్‌బీఐ శాఖ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు మల్లపురెడ్డి కోటీశ్వరరావు, బోయిన భానుమూర్తి, సూరా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్ఐసీ, ఎస్‌బీఐ నుంచి రుణాలు తీసుకున్న అదానీ సంస్థ ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. దీనిపై విచారణకు పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి ఆదిబాబు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి.బాలమురళి పాల్గొన్నారు.

సతీష్‌కు అభినందనల వెల్లువ



సతీష్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షునిగా నియమితులైన పార్టీ సీనియర్ నాయకుడు కడిమిశెట్టి సత్యనారాయణ(సతీష్)ను పార్టీ శ్రేణులు బుధవారం అభినందనలు తెలుపుతూ, సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఈ బాధ్యత అప్పగించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, సీనియర్ నాయకుడు, వైద్యుడు రామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబుల సతీష్‌ను సత్కరించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనుము, నువ్వు పంటలపై రైతులకు అవగాహన



జనుము, నువ్వుల పంటలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

అనకాపల్లిటౌన్ : ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల(నైర, శ్రీకాకుళం) విద్యార్థులు జనుము పంటలో సమస్యలపై మండలంలోని తుమ్మపాల గ్రామ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనుముపంటలో పువ్వురాలుట, కాయ రాకపోవడం తదితర అంశాలపై వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. నువ్వులు, జనుము, పొద్దుతిరుగుడు, మినుములో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏపీ ఎంఐసీ రంజిత మాట్లాడుతూ గ్రామంలో స్ప్రింక్లర్, డ్రిప్ ఇరిగేషన్ పైపులపై ప్రభుత్వ సబ్సిడీలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



హోలీ ఆడుతున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తతలారివానిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు వేసుకుని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డి నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ సత్యవతికి సత్కారం



సత్యవతిని సత్కరిస్తున్న జర్నలిస్టు ప్రతినిధులు

అనకాపల్లిటౌన్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ కల్యాణమండపంలో మంగళవారం ఎంపీ సత్యవతిని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజు, ఫెడరేషన్ అధ్యక్షుడు కొండలరావు, కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు ఈశ్వరరావు, రవికుమార్, వెంకటేష్ నారాయణరావు, కాంతారావు, శ్రీనివాస్, చక్రవర్తి పాల్గొన్నారు.

నూకాంబిక జాతర ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో చంద్రశేఖర్, జయవీర్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర చాటింపు ఘటాల ఊరేగింపు మంగళవారం ఘనంగా జరిగింది. 20న కొత్త అమావాస్య పురస్కరించుకుని ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటాల ఊరేగింపును ప్రారంభించారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా స్వయంభూ వెంకన్న డోలోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్ : స్థానిక దేవునిగుమ్మం స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి డోలోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబు, ఆలయ ఈవో ఆదినారాయణ, అధికారులు రమాబాయి, ప్రసాద్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

జలవనరుల సంరక్షణకు యువత కృషి

అనకాపల్లిటౌన్ : జల వనరుల సంరక్షణకు యువత కృషి చేయాలని నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. స్థానిక నైస్‌మేన్ పవర్ సొల్యూషన్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో మంగళవారం ×వర్షం నీటిని ఒడిసిపట్టండి×అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నీటి కొరత నేపథ్యంలో వర్షం నీటిని ఒడిసిపట్టేలా భవన నిర్మాణ డిజైన్లు రూపొందిస్తూ ప్రభుత్వం నిబంధనలు చేసిందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ చెక్‌డ్యాం, ఇంకుడు గుంతలు, ఇళ్ల మిద్దెలపై వర్షంనీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలన్నారు. వ్యాసరచనలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో నైస్‌మేన్ పవర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిళ్లా రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఐఎస్ విజయం ప్రతిపక్షాలకు చెంపపెట్టు

- పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకుల విజయోత్సవాలు



వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



తాళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆనందోత్సాహం

అనకాపల్లిటౌన్ : విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రతిపక్షాలకు చెంపపెట్టని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. భారతదేశ చరిత్రలో ఇప్పటి వరకు ఎక్కడా జరగని విధంగా విశాఖ సమ్మిట్ జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం, మంత్రి అమర్‌నాథ్ చొరవతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు. ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు రాష్ట్రంపై నమ్మకంతో పెట్టుబడులు పెడుతున్నా.. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు హేయమన్నారు. టీడీపీ కుత్సిత విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లాకు సుమారు రూ.లక్షా 21 వేల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్న ఘనత మంత్రి అమర్‌నాథ్‌కు దక్కిందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు యువతకి ఉపాధి కల్పించే దిశగా పరిశ్రమలను ఈ ప్రాంతానికి తీసుకువస్తున్నారని కొనియాడారు. కోడూరు గ్రామంలో పారిశ్రామిక వాడ నిర్మించి అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మంత్రి అమర్‌నాథ్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. అంతకుముందు పార్టీ శ్రేణులు పట్టణంలో పలు ప్రాంతాల్లో సమ్మిట్ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.

కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.రత్నకుమారి, పార్టీ నేతలు జి.గురుమూర్తి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, కలగా లక్ష్మి, పెతకంశెట్టి జగన్, మూనూరు శ్రీను, కె.సతీష్, గైపూరి రాజు, కోరుకొండ రాఘవ, కేఎం నాయుడు, దాడి నారాయణరావు, విల్లూరి చంద్రశేఖర్, కరక సోమునాయుడు, కె.కన్నబాబు, రాయవరపు జోగిరాజు, గొల్లవిల్లి నర్సింగరావు, పలకా సూర్యనారాయణ, మర్రిపల్లి శోభ, పి.పద్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ శ్రేణులు జీఐఎస్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. సమ్మిట్ విజయవంతానికి కారణమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, సర్పంచ్‌లు కొట్టె రాము, శ్యాం, నిమ్మదల సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి సతీష్, పార్టీ నాయకులు ముసిలినాయుడు, కోన నాగేశ్వరరావు, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.